# 4. దైవనామ స్మరణ

ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూహురైర (రజిఅన్) ఉల్లేఖించారు : దైవదూతలు కొందరు దైవనామాన్ని స్మరించే వారిని వెదుకుతూ దార్లలో తిరుగుతుంటారు. దైవ స్మరణలో నిమగ్నులై ఉన్నవారిని చూడగానే వారు, 'మా అవసరార్థం ఇటు మరలిరండి' అని పరస్పరం పిలుచుకుంటారు. దైవనామ స్మరణలో ఉన్నవారిని ఎందరు దూతలు తమ బాహువులతో ఆక్రమిస్తారంటే, వారి వరస మొదటి ఆకాశం వరకు చేరుకుంటుంది. వారిని వారి ప్రభువు, అంతా తెలిసి కూడా అడుగుతాడు : "నా దాసులు ఏమంటున్నారు?" దైవదూతలు సమాధాన మిస్తారు - 'వారు నీ పవిత్రతను కొనియాడుతున్నారు. ఇంకా, నీ గొప్పతనాన్ని కొనియాడుతున్నారు. ఇంకా, నీ ఔన్నత్యాన్ని శ్లాఘిస్తున్నారు. ఇంకా, నిన్ను స్తుతిస్తున్నారు. నీ పెద్దరికాన్ని వర్ణిస్తున్నారు.' అల్లాహ్ అడుగుతాడు : 'వారు నన్ను చూశారా?' 'లేదు. అల్లాహ్ సాక్షి! వారు నిన్ను చూడలేదు' అని దూతలు సమాధానమిస్తారు. అల్లాహ్ అడుగుతాడు : 'ఒకవేళ వారు నన్ను చూస్తే అప్పుడు వారి స్థితి ఎలా ఉంటుంది?' దూతలు అంటారు - 'వారు గనక నిన్ను చూసినట్లయితే నిన్ను మరింత ఎక్కువగా సేవిస్తారు. నిన్ను ఇంకా ఎక్కువగా జ్ఞాపకం చేస్తారు. ఇంకా ఎక్కువగా నీ పవిత్రతను కొనియాడతారు.' ఆయన అంటాడు : 'వారు నా నుండి ఏం కోరుతున్నారు?' దూతలు అంటారు - 'వారు మీతో స్వర్గం కోరుతున్నారు'. ఆయన అంటాడు : 'ఒకవేళ వారు నన్ను చూస్తే అప్పుడు వారి స్థితి ఎలా ఉంటుంది?' దూతలు అంటారు - 'వారు గనక నిన్ను చూసినట్లయితే నిన్ను మరింత ఎక్కువగా సేవిస్తారు. నిన్ను ఇంకా ఎక్కువగా జ్ఞాపకం చేస్తారు. ఇంకా ఎక్కువగా నీ పవిత్రతను కొనియాడుతారు. ఆయన అంటాడు : 'వారు నా నుండి ఏం కోరుతున్నారు?' దూతలు అంటారు - 'వారు మీతో స్వర్గం కోరుతున్నారు.' ఆయన అంటాడు : ఒకవేళ దాన్ని చూస్తే వారి పరిస్థితి ఎట్లా ఉంటుంది?' దూతలు బదులిస్తారు - 'వారు గనక దాన్ని చూస్తే ఇంకా అధికంగా దాన్ని ఆశిస్తారు. దాని కోసం ఎంతగానో గాలిస్తారు. దాని వైపునకు మరింత ఎక్కువగా మళ్ళుతారు.' ఆయన అడుగుతాడు : 'వారు దేన్నుండి శరణువేడుతున్నారు?' దూతలు సమాధానమిస్తారు - '(నరక) అగ్ని నుండి.' ఆయన అంటాడు : 'వారు ఆ అగ్నిని చూశారా?' దూతలంటారు - 'లేదు, అల్లాహ్ సాక్షిగా! ఓ ప్రభూ! వారు దాన్ని చూడలేదు.' ఆయన అంటాడు : 'ఒకవేళ వారు దాన్ని చూసి ఉంటే అప్పుడు వారి స్థితి ఏమౌను?' వారు సమాధానమిస్తారు - 'ఒకవేళ వారు దాన్ని చూస్తే దాన్నుండి మరింత దూరం

https://teluguislam.net

పారిపోతారు. దానిపట్ల ఇంకా ఎక్కువగా భయపడతారు.' అల్లాహ్ సెలవిస్తాడు : 'నేను మిమ్మల్ని సాక్ష్యంగా పెట్టి చెబుతున్నాను - నేను వారిని క్షమించి వేస్తాను.' అప్పుడు ఒక దూత అంటాడు - 'ఫలానా మనిషి స్మరణ చేసిన వారిలో లేడు. అతను మరో పని మీద అక్కడకు వచ్చేశాడు.' అల్లాహ్ అంటాడు : 'వారు (దైవస్మరణ చేసేవారు) ఎటువంటి వారంటే వారితోపాటు కూర్చున్న వ్యక్తి కూడా (ఆ భాగ్యాన్ని) కోల్పోడు." (బుఖారి)

ఈ హదీసులో "జిక్ర్" వాస్తవికతను, "జిక్ర్" చేసే వారి ఘనతను, ఇంకా జిక్ర్ చేసే వారితోపాటు కూర్చునే వారి భాగ్యాన్ని గురించి వివరించటం జరిగింది.

ఇక్కడ 'జిక్ర్' అంటే అర్థం ఇతర హదీసులలో పలుసార్లు నొక్కి చెప్పబడిన పవిత్ర వాక్కులను వల్లించడం. ఉదాహరణకు, 'సుబ్‌హానల్లాహ్', 'అల్‌హమ్‌దు లిల్లాహ్', 'లా ఇలాహ ఇల్లల్లాహ్', 'అల్లాహు అక్బర్'. ఇంకా అదేవిధంగా 'లాహౌల వ లా ఖువ్వత ఇల్లా బిల్లాహ్', 'బిస్మిల్లాహ్', 'హస్బునల్లాహ వ నీమల్ వకీల్', 'అస్తగ్‌ఫిరుల్లాహ్' మొదలగు వాక్యాలను పలుకుతూ ఉండటం, ఇంకా ఇహపర శ్రేయాలను దైవం నుండి కోరటం కూడా జిక్ర్ కోవలోకే వస్తాయి. వాజిబ్ మరియు ముస్తహబ్ ఆచరణలను చేయుటం కూడా కొన్ని సమయాలలో 'జిక్ర్' (దైవస్మరణ) గానే పరిగణించబడుతుంది. ఉదాహరణకు ఖుర్‌ఆన్ పారాయణం, హదీసు అధ్యయనం, జ్ఞాన సదనం, నఫిల్ నమాజులు.

దైవ నామ స్మరణ చేసే వ్యక్తికి తాను పలికే పదాల భావం తెలిస్తేనే పుణ్యఫలం లభిస్తుందన్న నియమం లేదు. అయితే ఆయా పదాలకు వ్యతిరేక భావం మాత్రం అతని మనసులో ఉండకూడదన్నది షరతు. పలికే పదాలకు అర్థం కూడా తెలిసి ఉంటే ఆ స్మరణ పరిపూర్ణతను సంతరించుకుంటుంది. అల్లాహ్ ఔన్నత్యం, ఆయన అన్ని లోపాలకు, బలహీనతలకు అతీతుడు అనే భావం మనసులో గనక సతతం మెదలుతూ ఉన్నట్లయితే అప్పుడు ఆ స్మరణ మరింత అర్థవంతం అవుతుంది. దైవమార్గంలో కృషి సలుపుతూ, ఆయన మనపై విధిగా చేసిన వాటిని తు.చ. తప్పకుండా పాటిస్తూ, గనక 'జిక్ర్' చేస్తే అది ఇంకా సమగ్రతను సంతరించు కుంటుంది. సంస్మర్త గనక ఏకాగ్ర చిత్తంతో దైవం వైపునకు మరలి, సంకల్పశుద్ధితో దైవాన్ని స్మరిస్తే అది మరింతగా ప్రభావవంతం అవుతుంది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ బసర్ (రజిఅన్) ఉల్లేఖించిన హదీసులో దైవ నామ స్మరణ యొక్క ప్రాముఖ్యత మరోవిధంగా చెప్పబడింది. ఒక వ్యక్తి మహాప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, "ఓ దైవప్రవక్తా! ఇస్లాం ఆదేశాలెన్నో ఉన్నాయి. మీరు నాకు ఏదో

https://teluguislam.net

ఒక దాన్ని గురించి చెప్పండి, దాన్ని నేను అంటిపెట్టుకుని ఉంటాను" అని అన్నాడు. అప్పుడు మహాప్రవక్త (సఅసం) ప్రబోధించారు - "నీ నోరు (నాలుక) సతతం అల్లాహ్ నామస్మరణలో ఉండాలి." (తిర్మిజి)

వివిధ ఉల్లేఖనాల ద్వారా స్పష్టమయ్యేదేమంటే, దేవుని పవిత్రతను, ఆయన ఘనతను కొనియాడటం, ఆయన స్తోత్రం చేయటం, ఆయన గ్రంథాన్ని పారాయణం చేయటం, స్వర్గ నరకాలను ప్రస్తావించటం, దైవానుగ్రహాలపై కృతజ్ఞతలు వ్యక్తపరచటం వంటివి 'జిక్ర్ సదనాలు' అనిపించుకుంటాయి.

"అంతా తెలిసి ఉండి కూడా వారిని వారి ప్రభువు అడుగుతాడు." సర్వజ్ఞాని అయిన అల్లాహ్, తన దూతలతో తన దాసుల గురించి అలా ప్రశ్నించాడంటే, దాసుల విధేయతను వారికి తెలియపరచటానికే అలా చేసి ఉండవచ్చు. ఎందుకంటే, అల్లాహ్ ఆదంను సృష్టించదలచినపుడు దైవదూతలు పలికిన పలుకులను దృష్టిలో ఉంచుకుని అల్లాహ్ ఈ విధంగా ప్రశ్నిస్తాడని కొందరు ఇస్లామీయ విద్వాంసులు వ్యాఖ్యానించారు. ధరణిలో ఒక ఖలీఫా (ప్రతినిధి)ని సృష్టించబోతున్నానని అల్లాహ్ అన్నప్పుడు దైవదూతలు,

> **"ప్రభూ! అవనిలో కల్లోలం రేకెత్తించే, రక్తపాతం సృష్టించేవాడిని నువ్వు సృష్టిస్తున్నావా?! నీ స్తోత్రంతో పాటు నీ పవిత్రతను కొనియాడటానికి మేమున్నాముగా" అని విన్నవించుకున్నారు. ఆయన సెలవిచ్చాడు : "ఏదైతే నాకు తెలుసో అది మీకు తెలియదు."**
>
> **(అల్ బఖర : 20)**

'ఆనాడు నేను ఆదంను సృష్టిస్తుంటే మీరలా అన్నారు, చూడండి ఇప్పుడు ఆదం సంతతి ఏ విధంగా షైతానీ ప్రేరణలను ఎదిరించి, నా స్తోత్రం చేస్తున్నారో అని అల్లాహ్ తన దూతలకు పరోక్షంగా చెప్పదలిచాడు.

ఈ హదీసుపై మరికొంతమంది విద్వాంసుల వ్యాఖ్యానం ఇలా ఉంది : ఆదం బిడ్డలు చేసే 'జిక్ర్' (దైవస్మరణ) దైవదూతలు చేసే స్మరణకన్నా శ్రేష్ఠమయినది. ఎందుకంటే మనిషి తన దైనందిన వ్యాపకాలను నిర్వర్తిస్తూ అనేక సమస్యల్ని ఎదుర్కొంటూ, షైతాన్ ఎత్తులను ఎప్పటికప్పుడు చిత్తుచేస్తూ దైవ నామస్మరణకు పూనుకుంటాడు. కాని దైవ దూతలకు ఈ ఇబ్బందులు లేవు.

"ఒకవేళ వారు నన్ను చూస్తే అప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంటుంద"ని ప్రశ్న

https://teluguislam.net

దీనిద్వారా తెలిసిందేమంటే ఐహిక జీవితంలో అల్లాహ్‌ను చూడటం సాధ్యపడదు. మహాప్రవక్త (స) ప్రవచనాన్ని ఇమామ్ ముస్లింగారూ అబూ అమామ ద్వారా ఉటంకించారు - ప్రవక్త (స) ఇలా అన్నారు : "మీరు మీ ప్రభువును మీరు మరణించే వరకు చూడలేరని తెలుసుకోండి." దైవచిత్తమయితే విశ్వాసులు తీర్పుదినంనాడు సర్వలోకాల ప్రభువును చూస్తారు. అయితే అల్లాహ్‌ను కళ్ళారా చూడకుండానే ఆయనకు భయపడటం, ఆయన వైపునకు మరలటమే సాఫల్యానికి నిదర్శనం.

"వారెటువంటి వారంటే వారితో పాటు కూర్చున్న వ్యక్తి కూడా (భాగ్యానికి) నోచుకోక పోడు."

సుబ్‌హానల్లాహ్! వారితో కలసి కూర్చున్న వ్యక్తి సయితం అదృష్టవంతుడై పోయాడంటే దైవ నామస్మరణ చేసేవారు ఎంతటి శుభప్రదమైనవారు!

ఈ హదీసులో పేర్కొనబడిన "జిక్ర్ సమావేశాలు" అంటే భావం విశ్వాస భావంతో దైవ నామాన్ని స్మరించే సమావేశాలలో విశ్వాసులను సహజమైన రీతిలో కలుసు కోవటం అని మహాప్రవక్త మరియు ఆయన సహచరుల హయాంలో అటువంటి సదనాలు సమావేశాలు జరిగేవి. విశ్వాసులు పరస్పరం కలుసుకునేవారు, పరామర్శలు జరిపేవారు. అల్లాహ్‌ను స్మరించేవారు. ఒండొకరిని మంచి వైపునకు ఆహ్వానించేవారు. చెడుల సంస్కరణకై నిర్మొహమాటంగా చెప్పేవారు. అల్లాహ్‌కు విధేయులై మెలగాలని, ఆయన ధర్మంపై స్థిరత్వం కలిగి ఉండాలని తాకీదు చేసేవారు.

ఈ హదీసు ద్వారా జిక్ర్ మరియు దానికోసం సమావేశమవటం యొక్క మహత్త్యం తెలిసి వస్తోంది. ఆఖరికి సద్వర్తనులతో కలిసి కూర్చునే వ్యక్తి కూడా కారుణ్య భాగ్యానికై అర్హుడైపోతాడు. 'దైవనామ స్మరణ' దైవదూతలకు ఆహారం వంటిదని వారు దానికోసం తిరుగుతూ ఉంటారని కూడా ఈ హదీసువల్ల తెలుస్తోంది. అల్లాహ్‌చే నిర్మితమైన స్వర్గం మేలైన వస్తువులతో నిండి ఉంది. దాన్ని ఆశించే వ్యక్తికై అల్లాహ్ మార్గం సుగమం చేస్తాడు. దానికి భిన్నంగా నరకం కష్టాలతో యాతనలతో నిండి ఉంది. ఎవరయితే నరకాగ్నిని కోరుకుని, దానికి ఆహుతి అయ్యేపనులు చేయాలనుకుంటారో అటువంటి వారికై కూడా అల్లాహ్ మార్గాలు తెరుస్తాడు.

https://teluguislam.net